www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 14 ఫిబ్రవరి 2024
5
అన్నమయ్య

## ఐఐటి, జెఇఇలో 'నలంద' విద్యార్థుల సత్తా

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**



బ్లిషన్ ఫవాజ్‌ఖాన్

జాతీయ స్థాయిలో జరిగిన ఐఐటి, జెఇఇ మెయిన్స్ 2024 ఫలితాలలో రీజెన్సీ నలంద జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి సత్తాచాటారని సిఇఒ విజయ్ చందు మంగళవారం తెలిపారు. వై.బ్లిషన్ 88 శాతం, పి.ఫవాజ్ ఖాన్ 75 శాతం మార్కులతో విజయం సాధించారని తెలిపారు. ఇంతటి విజయం సాధించి కళాశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన విద్యార్థులను విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ జి.ఎన్.నాయుడు అభినందించారు. సిఇఒ మాట్లాడుతూ పోటీ పరీక్షల పట్ల తమ కళాశాలలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించిన కళాశాల అధ్యాపకులను ప్రిన్సిపల్ బి.వి.నరసయ్య అభినందించారు.

# అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించాలి

**- కలెక్టర్ అభిషిక్త్ కిషోర్**

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ గిరీష

**ప్రజాశక్తి - రాయచోటి**

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్‌పి బి. కృష్ణారావు, డిఆర్‌ఒ సత్యనారాయణరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ పోలీస్, రెవెన్యూ, ప్రాసిక్యూషన్ విభాగాలు సమన్వ యంతో పనిచేసి ఎస్‌సి, ఎస్‌టి వర్గాలపై నమోదు అయిన కేసుల్లో జాప్యాన్ని నివారించి సత్వర న్యాయం అందించాలన్నారు. జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల పరిష్కా రంలో భాగంగా సంఘటనలు జరిగిన వెంటనే పోలీసులు విశ్వక్షబంధంగా విచారణ చేసి కేసులు నమోదు చేయా లన్నారు. ఎఫ్ఐఆర్ కాగానే బాధితులకు పరిహారం అందజేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టిలకు ఎక్కడ అన్యాయం జరిగినా అధికారుల దృష్టికి తీసుకురావాలని డివిఎంసి కమిటీ సభ్యులకు సూచించారు. 2023 నవంబరు 1 నుంచి డిసెంబర్ 31 వరకు జిల్లాలో మొత్తంగా 15 ఎస్‌సి, ఎస్‌టి కేసులు నమోదై విచారణ దశలో ఉన్నా యని వాటిని త్వరగా పరిష్క రించాలని సూచించారు. బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా చొరవ తీసుకో వాలన్నారు. కేసులలో ఎప్పటికప్పుడు ఛార్జిషీట్ దాఖలు చేయ డంతో పాటు నిర్ణీత సమయంలోగా కేసులను పూర్తిచేయాలని అన్నారు. బాధి తులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం సకాలంలో అందేలా చూడాలన్నారు. మండల, డివిజన్ స్థాయిలో ప్రతినెలా క్రమం తప్పకుండా సివిల్ రైట్స్ డే నిర్వహి ంచాలని, కేసులకు సంబంధించి కుల ధృవీకరణ పత్రాలను సంబంధిత తహశీల్దార్లు వెంటనే జారీ చేయాలని, దీన్ని పర్యవేక్షించాలని ఆర్ డిఒలకు సూచించారు. స్పీడ్ కేసులలో త్వరితగతిన జడ్జిమెంట్ వచ్చేలా పోలీస్, న్యాయ శాఖ పిపిలు కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎస్‌పి బి. కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాలో నమోదైన అట్రా సిటీ కేసులకు సంబంధించి ఎలాంటి పక్షపాతం, జాప్యం లేకుండా విచారణ చేస్తుందని తెలిపారు. ఇప్పటికే అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ సందర్భంగా కేసులకు సంబంధించిన ఎలాంటి సమాచారం తమ దృష్టికి తీసుకురావాలని సభ్యులను కోరారు. జిల్లాలో నమోదైన ఎస్‌సి, ఎస్‌టి కేసుల ప్రగతి, ఆయా అంశాలలో తీసు కున్న చర్యలపై డివిఎంసి సభ్యులు అడిగిన సందేహాలకు కలెక్టర్, ఎస్‌పి సందేహాలు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా రాయచోటిలో అంబేద్కర్ భవన్ ఏర్పాటు చేయాలని, జిల్లాలో అన్ని మండలాలలో ఎస్‌సి, ఎస్‌టి శ్మశాన వాటికలు కూడా ఏర్పాటు చేస్తే బాగుంటుందని కమిటీ సభ్యులు కలెక్టరుకు విన్నవించారు. ఈ అంశాలను ప్రత్యేక దృష్టితో సానుకూలంగా పరిష్క రించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. సమీక్షలో రాజంపేట ఆర్‌డిఒ మోహన్‌రావు, డిఎస్‌పిలు మహబూబ్‌బాషా, కేశప్ప, వివిఎన్‌కె చైతన్య, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి జాకీర్ హుస్సేన్, బిసి సంక్షేమ శాఖ అధికారి సందప్ప, న్యాయశాఖ పబ్లిక్ ప్రాసిక్యూటర్, జిల్లా నిఘా పర్యవేక్షక కమిటీ సభ్యులు హాజరయ్యారు.

# 'యువత ఓటు నమోదు చేసుకోవాలి'

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

**ప్రజాశక్తి - రాయచోటి**

నియోజకవర్గంలో 18 ఏళ్లు నిండిన ప్రతి యువత ఓటు నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని టిడిపి పట్టణ అధ్యక్షులు, ఎపి వారియర్స్ నియోజక వర్గ టీమ్ కార్యవర్గ సభ్యులు బోనమాల ఖాదరవల్లి, జి.నాగేంద్ర పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు, రాయచోటి నియో జకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి సూచనల మేరకు స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్క విద్యార్థి, యువత అందరూ ఓట్లు నమోదు చేసుకో వాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటికి 45 లక్షల మంది కొత్త ఓటర్లుగా నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. విద్యా ర్థులు, యువత, రాష్ట్రంలో ఎవరైనా ఓటు నమోదు చేసుకోకుంటే ఈ నెల 15 లోపు చేసుకోవాలని తెలియజేసారు. ఇప్పుడు ఉన్న ప్రతి కొత్త ఓటరు మన రాష్ట్రంలో జరుగుతున్న విపత్కర పరిస్థుల నుంచి బయటపడటానికి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి అహర్నిశలు శ్రమించే వ్యక్తి అని అన్నారు. తెలుగుదేశం జనసేన ఉమ్మడి కూటమిలో భాగంగా గెలిచాక 20 లక్షల ఉద్యోగాలు రూపకల్పనకు సిద్ధం చేశారని అన్నా రు. అలాగే యువగళం నిధి కింద ప్రతి నిరుద్యోగికి ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3 వేలు ఇవ్వడానికి నారా లోకేష్ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇలాంటి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పన చేశారని చెప్పారు. ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తుకు ఓటు వేసి నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, గుర్రం సుబ్బయ్య, కొట్టే చలపతి, ఇలి యాస్ అమీర్జాన్, వెంకటరామిరెడ్డి, ఏపీ వారియర్స్ టీమ్ పాల్గొన్నారు.

# టిడిపిలో టికెట్ల వేట

టిడిపిలో టికెట్ల పోరు పతాకస్థాయికి చేరుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న కొద్దీ ఆశావహుల్లో అలజడి నెలకొంది. టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు జనసేన, బిజెపి పొత్తుల్లో తలమునకలైన నేపథ్యంలో ఎవరి టికెట్‌కు ఎసరు వస్తుందోనని, ఎవరికి ఎగనామం పెరుకుతారోననే తెలియని గందరగోళ వాతావరణం నెలకొంది. ఇటువంటి పరిస్థితుల్లో ఉమ్మడి కడప జిల్లాలో రాజకీయం వేడెక్కింది. ఇందులోభాగంగా టిడిపి నేతల్లో కొందరు భారీ డిన్నర్లు, మరొకరు తనకే టికెట్ వచ్చిందని, మరొకరు గుంభనంగా ప్రచారం నిర్వహిస్తుండడం ఆసక్తిని కలిగిస్తోంది. మరి కొన్ని అసెంబ్లీల్లో టికెట్లు ప్రకటించక మునుపే ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండడం వంటి వ్యూహాత్మక ఎత్తుగడలతో ముందుకు సాగుతుండడం ఆసక్తిని కలిగిస్తోంది.

- రాయచోటిలో ఒకరు భారీ డిన్నర్, మరొకరు ట్వీట్లు
- కడప, జమ్మలమడుగుల్లో ప్రచార జోరు
- ప్రొద్దుటూరులో గ్రూపుల పోరు
- మిగిలిన చోట్ల ఎవరి దారి వారిదే
- అధికారిక ప్రకటన కోసం నిరీక్షణ

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

ఉమ్మడి కడప జిల్లాలో రాజకీయం రసవత్తంగా మారింది. సార్వత్రిక ఎన్నికల ఎన్నికల షెడ్యూలు నేడో, రేపో విడుదల చేయనున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహణకు, అసంతృప్తులను బుజ్జగించడానికి సమయం తక్కువగా ఉండే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్, రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు టికెట్ల కోసం సిగ పట్లు పట్టడం ఆసక్తిని కలిగిస్తోంది.

### రసవత్తరంగా రాయచోటి రాజకీయం

రాయచోటి నేతలు వ్యూహాత్మక ఎత్తుగడల్లో నిమగ్నమయ్యారు. మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి భారీ డిన్నర్ నిర్వహించడం ద్వారా టిడిపి కార్యకర్తలను సమీపించుకోవడం, అసంతృప్తులను బుజ్జగించడం వంటి ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నారు. ఇదేతరుణంలో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధిష్టానం నుంచి తనకే టికెట్ లభించిందని సమాచారం ఉందనే ప్రచారంతో కేడర్ సంబరాలు చేసు ంటున్న వైనం ఆసక్తిని కలిగిస్తోంది. ఇంకొకరు మాజీ ఎమ్మెల్యే ఆర్. రమేష్‌రెడ్డి తనదైన శైలిలో ఎన్నికల ప్రచారంతో వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్న వాతావరణం నెలకొంది. రాజంపేటలో ఇన్‌ఛార్జి, సీనియర్ నాయకులు బత్యాల చెంగల్రాయుడు, ఇటీవలే తెరపైకి వచ్చిన పారిశ్రామికవేత్త ఘంటా నరహరి, విద్యావేత్త జగన్మోహన్‌రాజు మధ్య టికెట్ పోటీ నెలకొంది. ముగ్గురు ఆశావహు లు నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి కేడర్‌ను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుండడం గమనార్హం. కడపలో టిడిపి నేతల్లో గందరగోళం నెలకొంది. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుని సతీమణి ఆర్. మాధవీరెడ్డి టికెట్‌పై భరోసాతో నియోజకవర్గవ్యాప్తంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తోంది. ప్రత్యర్థులైన సీనియర్ నాయకులు అలంఖాన్‌పల్లి లక్ష్మీరెడ్డి, అమీర్‌బాబు సైతం తనదైన శైలిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండడం ఆసక్తిని కలిగిస్తోంది. వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే, డిప్యూటీ సిఎం అంజాద్‌బాషాపై హాట్ కామెంట్లతో రాజకీయాన్ని రసవత్తరంగా మార్చేయడం తెలిసిందే. కమలాపురం ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డికి టికెట్ స్పష్టత లేకపోవడంతో నిరీక్షిస్తుండడం గమనార్హం. మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి ఇటీవల పార్టీలో చేరి టికెట్ ఆశిస్తుండడంతో కార్యకర్తల్లో గందరగోళం నెలకొంది. ప్రొద్దుటూరు బరిలో నలుగురు ఆశావహులతో హైటెన్షన్ రాజకీయం నడుస్తోంది. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్, శ్రీనివాసులరెడ్డి భరోసాతో యువ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ప్రధాన ఆశావహునిగా మారడం ప్రత్యర్థుల్లో గుబులు రేగుతోంది. మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి టికెట్ తనదేనని, పార్టీ కోసం రూ.300 కోట్లు మేర నష్టపోయాయని పేర్కొనడం ద్వారా ప్రధాన పోటీదారునిగా మారడం గమనార్హం. ఈయనతోపాటు సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి టికెట్ ఇస్తే పోటీ చేస్తాననే ధోరణి వ్యక్తం చేయడం ఆసక్తిని కలిగిస్తోంది. ముగ్గురికితోడు నేను సైతం అంటూ సి.ఎం సురేష్ సైతం టికెట్ ఆశా వహుల్లో ఒకరుగా ఉండడం ఎనలేని ఆసక్తిని కలిగిస్తోంది. జమ్మలమడుగులో టిడిపి టికెట్ ప్రధాన ఆశావహునిగా భూపేష్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. యువ కుడు, సౌమ్యునిగా ముద్రపడడంతో ఆశావహ వాతావరణం ఏర్పడింది. ఇంతలో జనసేన, బిజెపి పొత్తు నేపథ్యంలో మాజీమంత్రి ఆదినారాయణరెడ్డి పోటీ చేయడానికి అవకాశాలు ఉన్నాయనే ప్రచారం సాగుతోంది. టిడిపి అభ్యర్థుల్లో గెలిచే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఇటువంటి ఊహాగానాలను వదలడం చికాకు పరుస్తోంది. ఇటు వంటి తరహా వాతావరణం రాజంపేటలోనూ నెలకొంది. ఇక్కడ టిడిపి గట్టి అభ్యర్థిని నిలిపితే గెలిచే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయనే అంచనాలు ఉన్నాయి. ఇటువంటి చోట జనసేన, బిజెపికి ఇస్తే టిడిపి ఖాతా తెరడం కష్టమేననే వాదన వినిపిస్తోంది. ఏదే మైనా జనసేన, బిజెపి అలయెన్స్ కారణంగా టిడి పి, మిత్రులు నష్టపోయే అవకాశాలు ఉన్నాయనే వాదన విశ్లేషకుల నుంచి వినిపిస్తోంది.

# ఒపిఎస్ ఇచ్చేవారికే ఓటు : యుటిఎఫ్

**ప్రజాశక్తి-పీలేరు**

ఉద్యోగ, ఉపాధ్యాయులుకు ఒపిఎస్ ఇచ్చే వారికే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేస్తామని యుటిఎఫ్ నాయకత్వం తన నిర్ణయాన్ని ప్రకటించింది. మంగళవారం పీలేరులో యుటిఎఫ్ నాయకత్వం ఈ మేరకు గోడ పత్రికలు ఆవిష్కరించింది. తాను అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తానని ఇచ్ఛాపురం మొదలు కుప్పం వరకు తన పాదయాత్రలో, సమావేశాల్లో చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, చివరికి ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచిస్తూ సిపిఎస్ స్థానంలో జిపిఎస్ తీసుకొస్తామంటూ ఏవేవో పనికిమాలినవ ప్రకటనలతో మోసం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ ఒపిఎస్ అమలు చేస్తామని మేనిఫెస్టోలో చేర్చే పార్టీకే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. తమకు జరిగిన అన్యాయాన్ని బహిరంగపరచడానికి యత్నించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల ఉద్యమాలను రాష్ట్ర ప్రభుత్వం తన అధికారాలతో అణిచివేయడానికి ప్రయత్నం చేసినా, ఏమాత్రం జంకాకుండా యుటిఎఫ్ నాయకత్వం ఎదిరించి పోరాడిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు సదాశివరెడ్డి, అన్నమయ్య జిల్లా నాయకులు శివారెడ్డి, అక్రంబాషా, చంద్రశేఖర్, రాధాకృష్ణ, కృష్ణమూర్తి, శెట్టి సుబ్రమణ్యం, మస్తాన్, వెంకటరమణ, సుధాకర్, వేణుగోపాల్, ముని రెడ్డి, పేరయ్య, వెంకటరమణారెడ్డి, పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

జెసికి వినతిపత్రం అందిస్తున్న అఖిలపక్షం నాయకులు

## హార్సిలీహిల్స్‌లో భూమిని కేటాయించొద్దు

**- జెసికి అఖిలపక్ష నాయకుల వినతి**

**ప్రజాశక్తి-మదనపల్లి**

హార్సిలీహిల్స్‌లో యాత్ర-2 సినిమా డైరెక్టర్‌కు రెండు ఎకరాల భూమిని కేటాయించొద్దని జాయింట్ కలెక్టర్‌ను అఖిలపక్ష నాయకులు కలిసి వినతపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మురళి, టిడిపి బిసి సెల్ అధ్యక్షుడు సురేంద్ర యాదవ్, జై భీమ్ భారత్ పార్టీ నాయకులు కొన భాస్కర్ మాట్లాడుతూ హార్సిలీ హిల్స్‌లో ఇప్పటికే ఆ భూమిని క్రీడా శిక్షణ కోసం కేటాయించారని, అలాంటి ప్రభుత్వ విలువైన భూములను ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించాలని ప్రభుత్వం చూడటం సరికాదని అన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిగత ప్రచారం కోసం ప్రభుత్వ భూములు పంచిపెడితే ఊరుకోమని, కచ్చితంగా అడ్డుకుంటామని పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు హార్సిలీ హిల్స్ వెళ్లి అక్కడ భూమిని పరిశీలించి హడావిడి చేశారని, అధికారులను అడిగితే మాకు ఎలాంటి సమాచారం లేదని అంటున్నారని చెప్పారు. అధికారులకు అధికారికంగా ఉత్తర్వులు లేకుంటే ఏవిధంగా భూమి పరిశీలన చేస్తారని ప్రశ్నించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మాకు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేవని, ఆభూమి కేవలం క్రీడా శిక్షణ కోసం కేటాయించారని అందుకే ఉపయోగించాలని, సినిమ డైరెక్టర్లకు ఎందుకు కేటాయిస్తామని అలాంటి అపోహలు ఏమి పెట్టుకోవద్దని అన్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాపతి, రాజారెడ్డి, వెంకటేష్, సదాశివ పాల్గొన్నారు.

## ఎంపీ చొరవతోనే 'బిటి'కి యూనివర్సిటీ స్థాయి

మాట్లాడుతున్న నిస్సార్ అహమ్మద్

**ప్రజాశక్తి-మదనపల్లి :** రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చొరవ తోనే బిటి కళాశాలకు యూనివర్సిటీ స్థాయి లభించిందని వైసిపి మదనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిస్సార్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ బిటి ప్రభుత్వ కళాశాలను యూనివర్సిటీ గా గుర్తించడానికి సంబంధించిన ప్రభుత్వ జిఒ ఉత్తర్వులను చూపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజాకిరణ్‌రెడ్డి, వైస్ చైర్మన్లు నూర్ ఆజం, జింకా వెంకటచలపతి, కౌన్సిలర్లు షేక్.కరీముల్లా, రామకృష్ణారెడ్డి, శివయ్య, ఎం.వి.రమణ, ఈశ్వర్ నాయక్, రేణుక, మండల నాయకులు చంద్ర పాల్గొన్నారు.

## రూ.పది ఇచ్చి వంద దోచేస్తున్న ప్రభుత్వం : టిడిపి




సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జె వెంకటేష్

**ప్రజాశక్తి- మదనపల్లి**

జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి సామాన్యుల రక్తాన్ని పీలుస్తూ ప్రభుత్వాన్ని నడుపుతున్న వైసిపిని ఇంటికి పంపాలని తెలుగుదేశం పార్టీ రాజంపేట అధికార ప్రతినిధి ఆర్.జె వెంకటేష్ కోరారు. మంగళవారం మదనపల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో పలు పథకాల ద్వారా రూ.10 ఇచ్చి రూ.100 దోచేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పెట్రోలు రూ. 70, వంటనూనె , గ్యాస్ రూ. 720 ఉండగా వైసీపీ ప్రభుత్వం పెట్రోల్ పై రూ. 40, వంట నూనె పై రూ. 130, గ్యాస్‌పై రూ.500 వరకు పెంచడమే కాక ఆర్‌టిసి ఛార్జీలను ఐదుసార్లు, కరెంటు ఛార్జీలను పలుసార్లు పెంచి, ఇంటిపన్నును డబుల్ చేసి ఇలా ప్రజల మీద భారం వేశారన్నారు. ఉపాధి హామీ పథకాన్ని సైతం వదలకుండా దాదాపు రూ. 500 కోట్లను పక్కదారి పట్టించి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సైతం మూడు నాలుగు నెలలకు ఒకసారి జీతాలను చెల్లిస్తున్నారని తద్వారా ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేశారన్నారు. మదనపల్లిలో హంద్రీనీవా కాలువకు గండిపడి పట్టణంలోని రోడ్లపై నీరు ప్రవహిస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పటికే గుంతలమయమైన రోడ్లపై హంద్రీనీవా నీరు ప్రవహిస్తూ ఉండడంతో మరింత అధ్వాన పరిస్థితుల మధ్య ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓటు రూపంలో వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పి ఇంటికి పంపాలని కోరారు. కార్యక్రమంలో రామచంద్ర నాయుడు, రెడ్డప్ప, బొంత మల్లికార్జున పాల్గొన్నారు.

## టిడిపిలో 30 కుటుంబాలు చేరిక

**ప్రజాశక్తి-పీలేరు**

వైసిపి నుంచి టిడిపిలోకి వలసల జోరందుకుంది. రాజంపేట పార్లమెంట్ టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కుప్పం రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నగిరిపల్లిలో కెవిపల్లి మండలం, నక్కల దిన్నెవడ్డిపల్లికి చెందిన 30 కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలోకి చేరాయి. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి వారి మెడలో కండువాలు వేసి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరి సమస్యకూ పరిష్కారం చూపుతూ సముచిత స్థానం కల్పిస్తామని హామీనిచ్చారు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, రాబోయే ఎన్నికల్లో నియోజక వర్గంలో టిడిపి గెలుపుతో పాటు రాష్ట్రంలో చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా కష్టపడి పని చేయాలని కోరారు.

టిడిపిలో చేరిన వారితో కిషోర్‌కుమార్‌రెడ్డి

ఇన్వర్టర్ వితరణ చేస్తున్న జనసేన నాయకులు

## ఉర్దూ కళాశాలకు ఇన్వర్టర్ వితరణ

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలకు జనసేన నాయకులు అతికారి కృష్ణ సహకారంతో రాజంపేట జనసేన నాయకులు మంగళవారం రూ .20 వేలు విలువ చేసే విద్యుత్ ఇన్వర్టర్, బ్యాటరీ, విద్యుత్ సామగ్రిని కళాశాల ప్రిన్సిపల్ అజయ్ బాబుకు అందజేశారు. విద్యుత్ కోతల సమయంలో కంప్యూటర్ వినియోగించుకునేందుకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అతికారి కృష్ణ దృష్టికి తీసుకుపోగా ఇన్వర్టర్ వితరణ చేసినట్లు జనసేన నాయకులు తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం సహాయ సహకారం అందించిన అతికారి కృష్ణకు కళాశాల సిబ్బంది విద్యార్థులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కోలాటం హరికృష్ణ, నంద్యాల హరి, మన్నేరు సూరిబాబు, గద్దె లక్ష్మణ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తులసిరెడ్డి

## ఆ మూడు బిజెపికి తొత్తు పార్టీలు : పిసిసి

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

వైసిపి, టిడిపి, జనసేన ప్రాంతీయ పార్టీలు బిజెపికి బానిస పార్టీలని మీడియా చైర్మన్ తులసిరెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన రాజంపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆ మూడు పార్టీలు బిజెపి చేతులు వీలుబొమ్మలుగా మారడం శోచనీయమన్నారు. రాష్ట్రానికి బిజెపి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని, ప్రత్యేక హోదాకు పంగనామాలు పెట్టిందని, రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాల ప్రత్యేక అభివృద్ధి, ప్యాకేజీకి తిలోదకాలిచ్చిందని వ్యాఖ్యానించారు. కడప స్టీల్ ప్లాంట్‌కు స్వస్తి పలికిందని, దుగ్గరాజపట్నం ఓడరేవు ఊసే లేదని, పోలవరం ప్రశ్నార్థకమైందని, విజయవాడకు మెట్రో రైలు రాలేదని, విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మాలని చూస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో బిజెపికి ఎంత మాత్రం బలం లేదని, ఒక ఎమ్మెల్యే గానీ, ఎంపీగాని లేకుండానే పెత్తనం చెలాయిస్తోందన్నారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు బిజెపికి బానిసలుగా మారడమే కాకుండా రాష్ట్ర ప్రజలను కూడా బానిసలుగా మారుస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి పూల భాస్కర్, మండల అధ్యక్షులు జనార్ధన, పట్టణ అధ్యక్షులు కనిశెట్టి నరేష్, శివ పాల్గొన్నారు.

## లీగల్ సెల్ అధ్యక్షుడికి సన్మానం

**ప్రజాశక్తి-మదనపల్లె**

వెంకటరమణారెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సాహెబ్

అన్నమయ్య జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులుగా నియామకం పత్రం అందుకున్న న్యాయవాది తొట్లి వెంకట రమణరెడ్డిని కాంగ్రెస్ పార్టీ మదనపల్లి నియోజక వర్గనాయకులు రెడ్డి సాహెబ్ మంగళవారం ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకట రమణరెడ్డి కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ విజయానికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వైఎస్.రెడ్డి, మహమ్మద్ పీర్, శామీర్, జిల్లా ఎస్‌సిసెల్ ఉపాధ్యక్షులు రవీంద్ర, చల్లా నాని, ఈశ్వరమ్మ, బయ్యారెడ్డి, అమీర్‌జాన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ టి.వెంకట్రావు

## ఎపిజిబి సేవలను సద్వినియోగం చేసుకోండి

**ప్రజాశక్తి-గాలివీడు**

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో డిపాజిట్ లపై వడ్డీ అధికంగా అందిస్తున్నామని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ జనరల్ మేనేజర్ టి.వెంకట్రావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో పంట రుణాలు 93 కోట్ల రూపాయలు ఇవ్వడం జరిగిందని, 30 కోట్లు డిపాజిట్ రూపంలో కలవని పేర్కొన్నారు. అన్ని బ్యాంకులు కంటే ఎపిజిబి అధికంగా వడ్డీ చెల్లిస్తుందని పేర్కొన్నారు. ప్రగతి కుబేర్ 444 రోజుల పథకానికి 8.25 శాతం వడ్డీ ఇస్తున్నట్లు తెలిపారు. మహిళా డిపాజిటర్లకు 8.30శాతం, సీనియర్ సిటిజన్లకు 8శాతం సాధారణ మహిళలకు 7.5 వడ్డీ అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, రైతులు పారిశ్రామికవేత్తలు, ప్రజలందరూ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## జయహో బిసి సమావేశాన్ని విజయవంతం చేయండి

**ప్రజాశక్తి-కలికిరి**

స్థానిక మండల కేంద్రంలోని ఎహెచ్‌సి కల్యాణమండపంలో బుధవారం నిర్వహిస్తున్న జయహో బిసి సమావేశాన్ని విజయవంతం చేయాలని రాజంపేట పార్లమెంట్ బిసి ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, రాజంపేట పార్లమెంట్ కురబ చైర్మన్ జనార్ధన్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ నాయకులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. టిడిపి ప్రభుత్వ హయాంలో బిసిలకు ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన కల్పించి, రాబోవు టిడిపి ప్రభుత్వంలో బిసిలకు అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేసుకోవడానికి తగు సలహాలు స్వీకరిస్తామని అన్నారు. కార్యక్రమంలో బాటర్‌షెడ్ రవి, బండి మురళి, మేస్త్రి రవి పాల్గొన్నారు.

## 16 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

**ప్రజాశక్తి-గాలివీడు**

స్థానిక ఆర్‌ఆర్ జూనియర్ కళాశాలలో 16 నుంచి 19వ తేదీ వరకు ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు కెజిబివి నుంచి 11మంది, ఎంఎన్‌ఆర్ కాలేజ్ నుంచి ఇద్దరు, జూనియర్ కాలేజ్ నుంచి 63 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు హాజరవుతారని పేర్కొన్నారు.

## మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించాలి

**ప్రజాశక్తి - వేంపల్లె**

వాతావరణంలోని కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని ట్రిపుల్‌ఐటి ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ విశ్వనాథరెడ్డి, పంచాయతీ కార్యదర్శి గంగులయ్య సూచించారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో చెరుకాంపల్లెలో మంగళవారం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాతా వరణంలో సంభవించే కాలుష్యంపై అవగాహన పెంచేందుకు ర్యాలీ నిర్వహిం చారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. చెరుకాంపల్లెలో 5 రోజుల నుండి ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామంలోని ప్రజలకు పరిసరాలు శుభ్రంగా లేకపోతే వచ్చే రోగాలపై అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో యూనిట్ సభ్యులు, వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

**జమ్మలమడుగు రూరల్ :** పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందామని శ్రీనివాస డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పొన్నతోట, నర్సోజి కొట్టాలలో ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ శ్రీనివాస డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపు ఈనెల 9 నుంచి నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే పొన్నతోట, నర్సోజి కొట్టాల గ్రామాల్లోని పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలలో మొక్కలు నాటామన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.మహమ్మద్ రసూల్, గ్రామ సర్పంచ్ నారాయణ,

## సిద్ధం సభను జయప్రదం చేయండి : ఎమ్మెల్యే

**దువ్వూరు** : ఈనెల18న అనంతపురం జిల్లాలో వైసిపి తలపెట్టిన సిద్ధం సభను విజయంతం చేయాలని మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుండి లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ ఈ సభను విజయవంతం చేయాలన్నారు. ప్రతి గ్రామం నుండి అధిక సంఖ్యలో లబ్ధిదారులు ఈ సభకు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు తిరుపాలురెడ్డి, ఎంపిపి కానాల జయచంద్రరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి కానాల ఓబుల్ రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు చర్చి నిర్మాణానికి భూమిపూజ

**చాపాడు:** మండల కేంద్రమైన చాపాడు ఎస్సీ కాలనీలో బుధవారం ఉదయం సిఎస్‌ఐ చర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహిస్తున్నట్లు ఎంపిపి టి.లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ద్వారా రూ.12 లక్షలు నూతన చర్చి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

## వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

**ప్రజాశక్తి-తంబళ్లపల్లె**

కల్పవృక్ష వాహనంపై స్వామివారు

మండలంలోని కోసవారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకట రమణస్వామి ఆలయంలో ఐదు రోజులుగా వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహి స్తున్నారు. టిటిడి ఆధ్వర్యంలో జగు రుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉప ప్రధాన అర్చకులు కృష్ణ ప్రసాద్ భట్టార్, అర్చకులు రమేష్ బాబులు, శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని కల్పవృక్ష వాహనం హనుమంత వాహనాలపై ప్రత్యేక అలంకరణ చేశారు. సాంప్రదాయబద్ధంగా మేళా తాళాలతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. టిటిడి ధర్మ ప్రధాన పరిషత్ ఆధ్వర్యంలో రాత్రి హరికథ, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అల్లరింపజేశాయి. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ వరలక్ష్మి, ఎఇఒ గోపీనాథ్, ఇన్స్‌పెక్టర్ దీక్షిత్ కుమార్ పాల్గొన్నారు.


**మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందలూరు**

**E.P. No : 8/2023**
**O.S.NO : 6/2022**

భీమిశెట్టి లక్ష్మయ్య టీచర్, S/o సుబ్బరాయుడు, పుత్తనవారి పల్లె గ్రామము, పుల్లంపేట మండలం, అన్నమయ్య జిల్లా. ...పిటీషనరు/DHR

Vs

నెల్లివల్లె యల్లయ్య (Died),
His LR.s. నెల్లివల్లె రేఖ, రెడ్డిపల్లె (H.W), పుల్లంపేట మండలం, అన్నమయ్య జిల్లా. ...రెస్పాండెంట్/JDR

**నోటీసు**

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా పై తెలిపిన కోర్టు నందు పై తెలిపిన నంబరు గల పిటిషన్ దాఖలు చేసియున్నాము. మీకు ఎలాంటి ఆక్షేపణలు ఉన్నచో వకీలు ద్వారా గానీ, స్వయంగా గానీ హాజరై తమ యొక్క విన్నపము 19-02-2024వ తేదీన ఉదయం 10:30 గంటలకు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు నందలూరు నందు హాజరై తమ యొక్క విన్నపము తెలియజేయవలయును. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

**నారాయణ జల్లి**
అడ్వకేట్/నోటరీ
రాజంపేట. సెల్ : 96424 12242.


# హార్సిలీహిల్స్ భూముల జోలికొస్తే ఊరుకోం

**- విపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు**

తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న విపక్ష, ప్రజాసంఘాల నాయకులు

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

తన సొంత డబ్బా ప్రజలకు చూపించడానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి యాత్ర-2 పేరిట ఒక సినిమా తీసిన దర్శకుడు రాఘవకు సొంత స్టూడియో నిర్మించడం కోసం, ఆంధ్ర ఊటీగా పేరు గాంచిన హార్సిలీహిల్స్ నందు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పనంగా ధారాదత్తం చేయడం తగదని బి.కొత్తకోట మండలంలోని విపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట టిడిపి, కాంగ్రెస్, సిపిఐ, జనసేన, విసికె, ఎఐటియుసి, బాస్ ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ ఇప్పించాలనే సదుద్దేశంతో వాకింగ్ ట్రాక్‌తో పాటు వాలీబాల్, హాకీ, ఖోఖో, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్ తదితర క్రీడలను నేర్చుకునేందుకు కోర్టులను నిర్మించాలని నిర్ణయించిందన్నారు. అందుకోసం ఒక ప్రణాళికను సిద్ధం చేసి హార్సిలీహిల్స్ లోని 517/1 సర్వేనెంబర్ గల టూరిజం శాఖకు సంబంధించిన భూమిలో 3.74 ఎకరాల స్థలాన్నికేటాయించిందని అన్నారు. తొలివిడతగా రూ.3.20 కోట్ల నిధులను మంజూరు చేసిందని, అందులోని రూ.1.60 కోట్ల నిధులతో భూమి చదును, ప్రహరీ నిర్మాణం పనులు జరిగిపోయాయన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం క్రీడాకారుల శిక్షణ శిబిరం పనులు చేపట్టక పోగా అందులోని రెండు ఎకరాల భూమిని ప్రయివేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయడం దారుణమన్నారు. క్రీడాకారులకు తీరని ద్రోహం చేయడమేనని ఆవేదన చెందారు. క్రీడల పట్లగాని క్రీడాకారుల పట్లగాని ఏ మాత్రం జగన్ సర్కార్ కు చిత్తశుద్ధి ఉన్నా, తన నిర్ణయాన్ని ఉపసంహరించుకొని క్రీడాకారుల శిక్షణా కేంద్రాన్ని నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం మండల రెవెన్యూ అధికారుల ద్వారా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండ`కిందపల్లి, కృష్ణారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి డి.చిన్నరెడ్డప్ప, ఎం.అష్రఫ్ అలి, టిడిపి నాయకులు టి.పద్మనాభం, షఫీవుల్లా, శత్రుఘ్న, రమ ఐమ్మ, రవీంద్రయాదవ్, నారాయణస్వామి, వెంకటరమణ, జనసేన పార్టీ నాయ కులు ఎస్.సయ్యద్‌బాషా, బాస్ నాయకులు ఎస్.శ్రీనివాసులు, వెంకటేష్, నవీన్, కిరణ్, సిపిఐ నాయకులు గంగులప్ప, నారాయణస్వామి,లక్ష్మన్న పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యక్రమాలపై దృష్టి : ఎస్ఐ

ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ లోకేష్‌రెడ్డి

**ప్రజాశక్తి-నిమ్మనపల్లి**

అసాంఘిక కార్యక్రమాలపై పోలీసులు ప్రత్యేక నిఘాను పెట్టినట్లు స్థానిక ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని అగ్రహారం గ్రామంలో ఎస్ఐ తన సిబ్బందితో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పరిధిలో నాటుసారా తయారీ, విక్రయం, కర్ణాటక మద్యం రవాణా, అమ్మకం, గంజాయి వినియోగం, కోడి పందెలు, పేకాటపైన ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఇటువంటి వాటిపై ప్రజలు పోలీసులకు సహకరించి సమాచారాన్ని అందించాలని, అవగాహన కల్పించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో పోలీసులు స్నేహపూర్వకంగా వ్యవహరిస్తారని అన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని తెలిపారు.

# ఉచిత పశు వైద్య శిబిరం విజయవంతం

**ప్రజాశక్తి-పీలేరు**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం పీలేరు శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించినట్లు ఆ సంఘం అధ్యక్షులు వగళ్ల చంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం పీలేరు మండలం, రేగళ్ల గ్రామంలోని పశు వైద్య శాలలో డాక్టర్ సాదిక్‌బాషా, జెవిఒ లక్ష్మయ్య, సచివాలయ ఉద్యోగులు జి.జ్ఞానేంద్ర, ఎస్. వినాయక్ కుమార్, ఎం.మోహన్, శంకరయ్య సహకారంతో ఈ పశువైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించామని అన్నారు. ఈ సందర్భంగా 200 పశువులకు పలు రకాల రోగాల నివారణలో భాగంగా మెలోనిక్స్, ఎంఢ్రోఫ్లాక్సీన్, పెండిస్టంట్ ట్యూబ్స్ ట్రై బెవటే, యూరోఇన్, విటమిన్ ఎ, డి,ఎ3, మినరల్ మిక్సర్, డి5, సెలైన్ మందులను వినియోగించి వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. ఈ శిబిరంలో పెన్షనర్ల సంఘం కార్యదర్శి జి.ఎర్రమరాజు, పి.కృష్ణయ్య, నరసింహారెడ్డి, ఆంజనేయులు, సీతారామరాజు, ఎన్.రామచంద్రయ్య, బి.జనార్ధన్, పి.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పశువైద్యులు

# రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్‌కు విద్యార్థి ఎంపిక

ప్రశంసా పత్రం అందుకుంటున్న కార్తీక్

**ప్రజాశక్తి-తంబళ్లపల్లి**

మండల పరిధిలోని కన్నెమడుగు జడ్‌పి హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న కార్తీక్ రూపొందించిన 'నర్సరీ మొక్కలను సంరక్షించే పద్ధతి' ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. నర్సరీలో ఉన్న మొక్కలను వర్షం. మంచు, వేడిమి నుండచి కాపాడడానికి అనునిత్యం మొక్కలపైన పట్టలను కప్పుతూ ఉంటారు. ఈ పని చేయడం కొంచెం ఆలస్యమైనా మొక్కలు ఎండిపోవడం జరుగుతుంది. ఈ పట్టలను కప్పడానికి కూలీలు అవసరం ఎక్కువగా ఉంటుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ కూలీల అవసరం లేకుండా మొక్కలను సంరక్షించుకోవచ్చు అని తెలియజేసే ప్రాజెక్టును కార్తీక రూపొందించిందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఉపాధ్యాయులు పిఎల్ఎన్ శాస్త్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

# టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : 'నల్లారి'

**ప్రజాశక్తి-పీలేరు**

తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కలిసి పనిచేయాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పీలేరు మండలం, వేపులబైలు పంచాయితీ, కంచం వారిపల్లి, నగరి, చెరుకువారిపల్లి, మొటుకుపల్లి, మిట్టపల్లి, కురవపల్లి, వరంపాటివారిపల్లిలో ఇంటింటా తిరిగి తెలుగుదేశం ప్రవేశపెట్టనున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా ఆయనకు రైతులు, మహిళలు, గ్రామ ప్రజలు మంగళ హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. మటుకుపల్లి సభలో కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గంలో కొండలు, గుట్టలు మాయం చేస్తూ ఇసుక, మైనింగ్ లాంటి ప్రకృతి సంపదను దోచుకుంటున్న వైకాపా నాయకుల్ని తరిమికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని పట్టణ, గ్రామాల్లో ప్రభుత్వ, పోరంబోకు భూములతో పాటు కొండలు,గుట్టలు కూడా కొల్లగొడుతూ, మైనింగ్, ఇసుక లాంటి ప్రకృతి సంపద, ప్రభుత్వ, ప్రజల సొమ్ము వందల కోట్లు దోచుకొంటున్నారని మండిపడ్డారు. అవి చాలక రైతుల పట్టా భూములపై కూడా పెత్తనం చలాయిస్తున్నారని ఆరోపించారు. అక్రమ సంపాదనతో ఓట్లు కొనాలని ప్రయత్నిస్తున్న వారికి వచ్చే ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కుతో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. రాష్ట్రంలో జగన్ రెడ్డి ప్రభుత్వంలో మోసపోయిన మహిళలు ఆర్థికంగా ఎదుగుదలే లక్ష్యంగా చంద్రబాబు ప్రకటించిన పథకాలతో మహిళలు మహాశక్తిగాఎదగాలని, రాష్ట్ర మహిళల అభివృద్ధి, సంక్షేమం దృష్టిలో ఉంచుకుని అన్నిరంగాల్లో మహిళలు ముందుండాలని తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ మహిళల కోసం చేపట్టిన ఆడబిడ్డ నిధి కింద18 ఏళ్ళు నిండిన స్త్రీ లకు ప్రతి నెలా రూ.15 వేలు, తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువు తుంటే అంతమాందికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేలు, దీపం పథకంలో ఏడాదికి గృహిణీలకు 3 సిలిండర్లు ఉచితంగా అందిస్తూ, ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలందరికీ టికెట్టులేని ప్రయాణం అమల్లోకి తీసుకురావడం కోసం తెలుగుదేశం పార్టీ శ్రీకారం చుట్టనుందని అన్నారు. సమావేశంలో టిడిపి శ్రేణులు బాబు రెడ్డి మల్లెల రెడ్డి బాష, పురం రామ్మూర్తి, వసంతాల రాజ, లక్ష్మీకర్, రెడ్డప్ప రెడ్డి, సిద్ధయ్య నాయుడు నాగమ్మ ప్రభాకర్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు, నరసింహులు నాయుడు, రవి నాయుడు, ఆనంద నాయుడు, గాయం వెంకట్ రెడ్డి, యుగంధర్, చంద్రమోహన్ పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్‌కుమార్‌రెడ్డి

# ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు : కలెక్టర్

**ప్రజాశక్తి-రాయచోటి**

ఎన్నికల విధులలో అలసత్వం ఉండరాదని, స్పందన అర్జీలకు త్వరితగతిన పరిష్కారం ఇవ్వాలని, కుల గణనను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు, నోడల్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో స్పందన, సాధారణ ఎన్నికలు, హౌసింగ్, కుల గణన, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, రీ సర్వే, తదితర అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ ఎన్నికల విధులలో అలసత్వం ఉండరాదని అధికారులను ఆదేశించారు. ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు వారికి కేటాయించబడిన అసెంబ్లీ నియోజకవర్గాల కు సంబంధించిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ రూముల ఏర్పాటు, వాటి నిర్వహణపై ఎక్కువ సమయం కేటాయించాలన్నారు. వచ్చే వారంలో ఎన్నికల విధులలో ఉన్న అధికారులందరికీ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఓటర్ల తుది జాబితాలో ఏవైనా తప్పులుంటే వెంటనే సరిదిద్దాలన్నారు. దీనికి సంబంధించిన ఫారం 6,7,8 లపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితా పై మీడియాలో వస్తున్న కథనాలను పరిశీలించి వాటిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీలలో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిస్తూ హౌసింగ్ కాలనీలలో ఇళ్ల నిర్మాణం కోసం అడ్వాన్స్ తీసుకున్నవారికి త్వరితగతిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్రతిరోజు సమీక్షించి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ గురించి సమీక్షిస్తూ జిల్లాలో పంపిణీ చేయవలసిన 4 లక్షల 67 వేల ఆరోగ్యశ్రీ కార్డులనుపంపిణీ చేయాలన్నారు. ఎంపిడిఒలతో సమన్వయం చేసుకొని ప్రక్రియను వేగవంతం చేయాలని ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ, ఎస్‌డిసి శ్రీలేఖ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


**పాస్‌పోర్ట్ పోయినది**

అన్నమయ్య జిల్లా, రాయచోటి మండలం మాధవరం గ్రామం, చెంచురెడ్డి గారి పల్లె డోర్ నెం. 27/28 కుర్ర పోతుల వెంకటరమణ భార్య కుర్రపోతుల వెంకటరమణమ్మ గల ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెంబర్ **P7709168** రాయచోటి ఆర్టీసీ బస్టాండ్‌లో పోయినది. ఎవరికైనా దొరికినచో 7337385215 మొబైల్ నెంబర్‌కు తెలపగలరు.

**పేరు మార్పు**

చెంచమ్మ అను నేను నా పేరు మార్చుకుంటున్నాను. భర్త సుంకేసుల హుస్సేన్‌సాబ్, చెన్నరాజుపోడు గ్రామం, ఓబులవారిపల్లె మండలం, అన్నమయ్య జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో నివాసం ఉంటున్నాను. నేను ఇప్పటి వరకు చెంచమ్మ (పాత పేరు)గా వాడుకలో ఉన్న నా పేరును సుంకేసుల మస్తాన్ బి (కొత్త పేరు)గా మార్చుకున్నాను. ఇకనుండి నా పేరు సుంకేసుల మస్తాన్ బి గమనించగలరు. ఈ పేరుతోనే లావాదేవీలు జరుపబడును.

నియామక పత్రాలు అందజేస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

## నలుగురు అంగన్వాడీల నియామకం

**ప్రజాశక్తి-రైల్వేకోడూరు**

నలుగురు అంగన్వాడీలను నూతనంగా నియమించినట్లు ఐసిడిఎస్ సిడిపిఒ టిపి.సౌభాగ్యమ్మ తెలిపారు. మంగళవారం వైసిపి కార్యాలయంలో నూతనంగా నియమితులైన నలుగురు అంగన్వాడీ సూపర్వైజర్లకు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, చేతుల మీదుగా అంగన్వాడీలకు అందజేశారు.

## 18న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ప్రజాశక్తి-గాలివీడు**

స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఈనెల 18న ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 1986-87 బ్యాచ్ చెందిన పూర్వ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అ పాఠశాల ఉపాధ్యా యుడు మహమ్మద్ గౌస్ పేర్కొన్నారు ఆబ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అందరూ ఒకరోజు సమయాన్ని కేటాయించుకొని ఈ పాఠశాలలో జరిగే పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని జయప్రదం చేసి సహకరించాలని కోరారు.

## రాయలసీమలో ఫ్యాక్షన్ జోన్ ఎందుకు..?

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

రాయలసీమలో ప్రస్తుతం ఎలాంటి ముఠా గొడవలు లేవని తక్షణమే ఫ్యాక్షన్ జోన్ ఎత్తేయాలని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ములపాకు ప్రతాప్‌రెడ్డి కోరారు. ఆ మేరకు ఆయన మంగళవారం మైదుకూరు రోడ్డులో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ 1980, 90 దశకాల్లో రాయలసీమలో రాజకీయాల కోసం హత్యలు గొడవలు ఉండేవన్నారు. అప్పటి అవసరాల దృష్ట్యా 1996లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ఫ్యాక్షన్ జోన్ పెట్టారని తెలిపారు. ఇప్పుడు అలాంటిదేమీ లేదన్నారు. ఫ్యాక్షన్ జోన్ తీసేయాలని, ఆ పదాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. హత్యలు, గొడవలు, ముఠా కక్షలు అన్ని ప్రాంతాలు.. అన్ని దేశాల్లో ఉన్నా రాయలసీమకు మాత్రమే ఫ్యాక్షన్ అనే పదం వల్ల చాలా అనర్థాలు జరిగాయన్నారు. ఫ్యాక్షన్ అనే పదాన్ని నిషేధించి రాయలసీమ ప్రజలను గౌరవించేలా చూడాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక యువత, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాలుబాల మనోహర్ బాబు, రాయలసీమ విద్యార్థి సమితి జిల్లా అధ్యక్షుడు హరి పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు మంజూరు

**ప్రజాశక్తి-ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

స్థానిక రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయానికి జిల్లా గ్రంథాలయ సంస్థ నిధుల నుండి కొత్త కాంపిటేషన్ పుస్తకాలు మంజూరైనట్లు రికార్డ్ అసిస్టెంట్ ఇబ్రహీం సాహెబ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, భారతదేశ చరిత్ర, ఆంధ్రప్రదేశ్ చరిత్ర, హైటెక్ విజయ రహస్యం, జాగ్రఫీ, ఇండియన్ పాలిటిక్స్, ఆంధ్రుల చరిత్ర, ఇండి యన్ ఎకానమీ వంటి పుస్తకాలు వచ్చాయన్నారు. వివిధ ఉద్యోగ పరీక్షలకు పోటీ పడే అభ్యర్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## నేడు వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం

**ప్రజాశక్తి- సింహాద్రిపురం**

డ్వాక్రా మహిళలకు సంబంధించిన వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల కన్వీనర్ దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో సల్మాన్ రాజ్, డిఆర్‌డిఎ ఏపీవో మంజునాథ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సింహాద్రిపురంలోని నూతన మార్కెట్ యార్డ్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కడప ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్‌డి అనిల్ కుమార్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

## డిఎస్‌సి జిఒ ప్రతులు దహనం

**ప్రజాశక్తి-పీలేరు**

ఎన్నో పోరాటాలు చేసి రద్దు చేసుకున్న అప్రెంటీస్ విధానాన్ని, ప్రభుత్వం మళ్లీ తీసుకు రావడాన్ని నిరసిస్తూ యుటిఎఫ్ నాయకులు డిఎస్‌సి జిఒ ప్రతులను దహనం చేశారు. మంగళవారం పట్టణంలోని ఎల్లవంద క్రాస్‌లో జరిగిన కార్యక్రమంలో నేతలు మాట్లాడుతూ మెగా డిఎస్‌సి ఉపాధ్యాయ నియామక కమిటీ ద్వారా చేస్తామని నిరుద్యోగ ఉపాధ్యాయులను ఊరించి, ఇప్పుడు కేవలం ఆరువేల ఉపాధ్యాయ పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేయడం అన్యాయమని అన్నారు. ఖాళీగా ఉన్న ముప్పైవేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు సదాశివరెడ్డి, శివా రెడ్డి, చంద్రశేఖర్, రాధాకృష్ణ, అక్రం బాష, వెంకట రమణ, సుధాకర్, శెట్టి సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, రుద్రయ్య, మస్తాన్, వేణు, వెంకటశివారెడ్డి, పాల్గొన్నారు.

డిఎస్‌సి ప్రతులను దహనం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

# క్రైం కార్నర్

## ట్రాక్టర్ బోల్తా : వ్యక్తి మృతి

**ప్రజాశక్తి-బి.కొత్తకోట**

మోరీని ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం బి.కొత్తకోటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని బుచ్చిరెడ్డిగారిపల్లి చెందిన కోడికూతల దాసరిరామదాసు మంగళవారం మధ్యాహ్నం బి.కొత్తకోట నుంచి సూరపువారిపల్లికి ట్రాక్టర్‌లో వెళుతుండగా దేగానిపల్లె డంపింగ్ యార్డ్ దగ్గర క్రాస్ వద్ద మోరిని ట్రాక్టర్ ఢీకొందని అన్నారు. ఈ ప్రమాదంలో రామదాసు ట్రాక్టర్ కింద పడి మృతి చెందినట్లు పేర్కొన్నారు. సమాచారం అందడంతో సంఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మద నపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

## రెండు బైక్‌లు ఢీ : యువకుడి దుర్మరణం

**ప్రజాశక్తి-పుల్లంపేట**

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాల సమీపంలో మంగళవారం రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటన యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఆదర్శ పాఠశాలలో సమీపంలో రెండు బైక్‌లు ఢీకొనగా అనంతంపల్లి గ్రామానికి చెందిన ఎం.శేఖర్ (25) ఘటనా స్థలంలోని అక్కడికక్కడే మృతి చెందాడని పేర్కొన్నారు. బైక్‌లో మరో యువకుడు కుంచం సాయికి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు చెప్పారు. యుక్త వయసులో ఉన్న కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.